# డాక్టరు భీమశంకరంగారి పరిశోధన

మధురాంతకం రాజారాం

డాక్టర్ భీమశంకరంగారు తమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నలుగురు మిత్రుల్ని విందుకు ఆహ్వానించారు. ఆ నలుగురిలో ముగ్గురు పురుషులు. నాలుగో వ్యక్తిమాత్రం స్త్రీ. అక్కడ సమావేశమైన మగవాళ్లు నలుగురూ గడ్డాలు నెరసిన ముసలి వగ్గులు. అందులో డాక్టరుగారికి తప్ప మిగతా ముగ్గురికీ జీవితంపైన మమకారం ఎప్పుడో నశించిపోయింది. ఏ ఇరవై, ముప్ఫైఏళ్ళకు ముందో వాళ్లు మృత్యుదేవత అనుగ్రహానికి పాత్రులు కాకపోవడముందే, అది భగవంతుడు వాళ్లకు విధించిన పెద్ద శిక్ష!

వాలుకుర్చీమీద, పిప్పళ్లబస్తాలా కూలబడి చుట్ట కాల్చుకుంటున్న వృద్ధుడిపేరు నీలాద్రి. యౌవనంలో అతడు విదేశాలతో పొగాకువ్యాపారంచేసి లక్షలు సంపాదించాడు. కానీ శ్రీదేవి చపల అని అతడికి తెలియదు. తెలియక పోవడంచేతనే అతడు గిండీ గుఱ్ఱపుపందాల్లో పాలొన్నాడు. అక్కడ మూదేవి అతడిని మనస్ఫూర్తిగా వలచింది. ఒక్కసారిగా అతడు బికారై పోయాడు. మీదైనంత అధ్వాన్నంగా కాలం వెళ్లబుచ్చాడు. తొండ ముదిరి ఊసరవెల్లైనట్లు కడకు గజదొంగగా తయారై కారాగారాన్ని సందర్శించాడు. ఆఖరుకు వేదాంతిగా మారి కృష్ణా, రామా అనుకుంటూ బంధువుల పంచలో జీవితం గడపసాగేడు.

నీలాద్రిప్రక్కన కుర్చీలో ఉపవిష్టుడై దినపత్రిక తిరగేస్తున్న వృద్ధుడిపేరు సింహాచలం. అతడు,


# "టామ్‌సాయర్ ప్రపంచయాత్ర"

## వారపత్రికలో త్వరలో ప్రారంభమవుతుంది.

టామ్‌సాయర్, హకల్‌బెరీఫిన్, రాజూ పేద, విచిత్రవ్యక్తి నవలలతో ఆంధ్రపాఠకలోకానికి మార్క్‌ట్వేన్‌ను పరిచయంచేసిన ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక మరొక మార్క్‌ట్వేన్ నవలను తెలుగులోకి అనువదించి అర్పిస్తున్నది. ఈకథ టామ్‌సాయర్, హకల్‌బెరీఫిన్ నవలలకు తరువాయి కథ. టామ్, హక్, నీగ్రోజిమ్ ముగ్గురూ ఈసారి ప్రపంచయాత్రకు బయల్దేరుతారు. వేలకొలదిమైళ్ళు అవలీలగా ప్రయాణంచేసి, ఎన్నో వింతలు విశేషాలుచూసి, ఎన్నో అద్భుతాలు చేస్తారు. అడుగడుగునా వారు ఎన్నోప్రమాదా లెదుర్కొంటారు. ప్రతిప్రమాదమూ చివరికి హాస్యంగా మారి నవ్విస్తుంది. ఈ హాస్యం ద్వారా అమెరికన్ గ్రామీణ మనస్తత్వాన్ని చిత్రించి వేళాకోళం చేయడం మార్క్‌ట్వేన్ ఆశయం.

"టామ్‌సాయర్ ప్రపంచయాత్ర" ప్రతివారూ చదివి ఆనందించదగిన సీరియల్.

## ★ డాక్టరు భీమశంకరంగారి పరిశోధన ★

తను బొబ్బిలి వెలమవంశంలో పుట్టినట్టు చెప్పుకుంటాడు. అందుకు తోడూ, ప్రథమ ప్రపంచ సంగ్రామంలో ఒక సైనికదళానికి కమాండరుగా పనిచేసినట్టు, అప్పట్లో తన సాహసకృత్యాలకు ప్రపంచం దిగ్భ్రమ చెందినట్టు కర్ణపేయంగా ఉపన్యసిస్తాడు. కానీ అతడు అబద్ధాలకోరని, అతని తండ్రి ఒక వకీలు గుమాస్తాఅనీ, నిజానికతడు సోల్జరుగా పనిచేసిన పాపాన పోలేదని ఊళ్లో చాలామందికి తెలుసు. ఐనా సింహాచలం డబ్బున్న మనిషి. తన అబద్ధాలను నమ్మినట్టు నటించగల వ్యక్తికి అతడెంతైనా సహాయం చేస్తాడు. అందుచేత అందరూ అతడు కనపడగానే చేతులు జోడిస్తారు. ఇంటికివస్తే ఆసనంచూపించి, గౌరవంగా ఆతిథ్యమిస్తారు.

మూడో అతిథి గుండూరావు వక్కాకు నములుతూ అటూ, ఇటూ పచారు చేస్తున్నాడు. అతడు పూర్వాశ్రమంలో పక్కా దేశనాయకుడుగా పనిచేశాడు. స్వార్థం ఏకోశానా లేని మహాత్యాగమూర్తిగా సభల్లో ప్రశంసింపబడ్డాడు. కానీ ప్రపంచంలో అతనిపైనకూడా అపోహలున్నాయి. దమ్మిడీ చేతలేకుండా జీవితాన్ని ప్రారంభించి, దేశసేవకు నడుం కట్టుకున్నట్టు లెక్చర్లు దంచి కడకు మేడలు మిద్దెలు కట్టుకున్న ఏ వ్యక్తినైనా లోకం అనుమానించడం సహజమే! కానీ గుండూరావు లోకుల్ని కాకులంటాడు. వాళ్ళ మాటలకు విలువయివ్వడు.

ఆ హాల్లో ఒక మూలగావున్న బెంచీపైన కూచుని పరధ్యానంగా పైకప్పును చూచుకుంటున్న ముసలావిడ పేరు హనుమాయమ్మ. ఆమె రిటయిరయి విశ్రాంతి తీసుకుంటున్న పంతులమ్మ. డాక్టరుగారి పిల్లలకు చిరకాలంనుంచీ ట్యూషన్ చెబుతున్నందువలన ఆమె ఆకుటుంబానికి చాలా దగ్గరమనిషైపోయింది. ఆమెను డాక్టరుగారు చెల్లీ అని పిలుస్తారు. ఆమె అతణ్ణి 'అన్నయ్యా' అంటుంది. అందుచేత ఆమెదగ్గర చదువుకుంటున్న పిల్లలుకూడా ఆమెని 'అత్తయ్యా' అని ఆప్యాయంగా సంబోధిస్తారు.

విందైపోయిన తర్వాత, అతిథులు భుక్తాయాసాన్ని తీర్చుకుంటూ, మత్తుగా మౌనంగా కూచునివుండగా, డాక్టరుగారు కుర్చీనుంచి పైకిలేచి హాల్లో నెలకొని వున్న ప్రశాంతతని భగ్నపరిచారు. "ఈరోజు మిమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించింది కేవలం విందుకోసమే కాదు. ఇంకొక ముఖ్య కారణంకూడా వుంది. అది చాలా ఆశ్చర్యకరమైన విషయం. అద్భుతం కూడా" అన్నాడాయన!

"ఏమిటి, ఏమిటి" అన్నారు అతిథులు నలుగురూ!

డాక్టరుగారు బీరువాలోనుంచీ ఒక పెద్ద గ్రంథాన్ని బయటికి తీశారు. ఆ గ్రంథంలో డాక్టరుగారి అద్భుత పరిశోధనలన్నీ ఉటంకింపబడి వుంటాయన్న విషయం అతిథులకు తెలియందికాదు. వాళ్లు దాన్ని చూడగానే నివ్వెరపోయి "ఈ రోజు ఇక్కడ ఏదో ప్రమాదం జరగడం తథ్యం" అనుకున్నారు.

డాక్టరు భీమశంకరంగారు ఆ గ్రంథంపైని బూజు దులిపి, అట్ట పైకితీసి రెండు పుటలమధ్య నలిగి పడివుండిన గులాబీ పువ్వు నొకదాన్ని పైకితీశారు. వాడి వత్తై ధూళిగా మారిపోవడానికి సిద్ధంగా వున్న ఆ పువ్వుని ఒక్కొక్కరికీ చూపిస్తూ "ఇదేమిటో మీకు తెలుసుననుకుంటాను" అన్నారు.

"తెలియకేమండీ! అది రోజా పువ్వు గదా" అన్నది హనుమాయమ్మ.

"అవును. ఒకప్పుడిది దివ్య సౌరభం వెదజిమ్మిన గులాబీ పువ్వుమే. కానీ అదెప్పటి మాట! ఏభైయేళ్ల క్రితం ఈ పువ్వు మా తోటలో పూచింది. చనిపోయి స్వర్గలోకంలో వుంది మా ఆవిడ! నా ఇరవైఅయిదో జన్మదినోత్సవం నాడు ఆమె నాకు దీన్ని బహూకరించింది. ఇప్పుడు నాకు డెబ్భైఅయిదేళ్లు. మీరందరూ ఒకసారి ఆలోచించండి. శుష్కించీ, శుష్కించీ చిత్తైపోయిన ఈ పువ్వు, ఇప్పుడే చెట్టులోనుంచి త్రుంపబడిన కొత్తపువ్వులా, తన పూర్వస్థితిని పొందడానికి అవకాశం లేదా?" అన్నారు డాక్టరుగారు.

అతిథులు ఒకరిముఖం మరొకరు చూచుకున్నారు. కొంపదీసి డాక్టరుగారేదైనా ఇంద్రజాలంద్వారా దాన్ని మళ్ళీ కొత్త పువ్వుగా మార్చేయగలరేమో నని సంశయించారు. కడకు పెదవివిరచి అందరూ ఒక్కుమ్మడిగా "అబ్బే, అదెలా సాధ్యమౌతుందండీ!" అన్నారు.

డాక్టరుగారొక్కసారి ఇంటి

కప్పైకెగిరిపోయేట్లు బిగ్గరగా నవ్వి "ప్రపంచంలో మానవుడికి సాధ్యంకాని దేదీ లేదు. మీరు కళ్లు తెరచుకుని చూస్తూవుండండి" అంటూ టేబిల్‌పైన వున్న ఒక గాజు పాత్రలో పువ్వుని పడవేశారు. తరువాత గదిలోపలికి వెళ్ళి ఒక కూజాతో నీళ్లు తెచ్చి గ్లాసుపాత్రలో పోశారు. మొదట పువ్వు నీళ్లపైన తేలిపోయింది. వివర్ణమైపోయివుండిన రేకులు, క్రమక్రమంగా వికసించ సాగినాయ్. కాడ పచ్చగా మారిపోయింది. అయిదునిమిషాల్లో ఒక క్రొత్త గులాబీపువ్వు నీళ్లపైన తేల సాగింది.

"అద్భుతం, అద్భుతం" అంటూ నీలాద్రి లేచి నిలుచున్నాడు. సింహాచలం వాలుకుర్చీలో నిటారుగా కూచుని "డాక్టరుగారూ! మీరింతటి మహాత్కార్యాన్ని చేయగలరని నేను కలలోకూడా అనుకోలేదు" అన్నాడు. గుండూరావు నోట మాటరాక స్తబ్ధుడై వుండిపోయాడు.

కానీ విచిత్రమేమిటంటే హనుమాయమ్మ ముఖంలోమాత్రం ఇంచుక ఆశ్చర్యంకూడా ద్యోతకం కాలేదు. ఆమె ఒక మందహాసంతో బెంచీపైనుంచి లేచివచ్చి గులాబీ పువ్వుని పరిశీలిస్తూ "మీరు మరేమీ అనుకోగూడదన్నయ్యా! గారడీవాడింతకన్నా అద్భుతాలు చేయడం నేనెన్నోసార్లు చూచాను" అన్నది.

"కానీ ఇది ఇంద్రజాలం కాదమ్మా" అన్నారు డాక్టరుగారు.

"ఏమో! ఇది ఇంద్రజాలం కాదని మాకు పూచీ ఏమిటి?" అన్నాడు నీలాద్రి.

"కాదని నేనిప్పుడే నిరూపిస్తానుగా!" అంటూ డాక్టరుగారు గదిలోపలికి వెళ్ళి నీళ్లకూజాతో తిరిగి వచ్చారు.

"ఇంకేం చేయబోతారేమిటి?" అన్నాడు సింహాచలం.

డాక్టరుగారు బదులుచెప్పకుండా కూజాలోని నీళ్లను నాలుగు గ్లాసులలోపోసి "వీటిలో మీరు తలా ఒకదాన్ని తీసుకోండి" అన్నారు.

అతిథులు నలుగురూ గ్లాసుల్ని చేతికి తీసుకుని, నీళ్లను గడగడా త్రాగేశారు. డాక్టరుగారు తృప్తిగా నిట్టూరుస్తూ కుర్చీలోకూచున్నారు.

"పోనీ, ఇది ఇంద్రజాలం కాదన్నారు. ఐతే ఈ కార్యం ఎలా సాధ్యమైందో చెబుతారా?" అన్నాడు గుండూరావు.

డాక్టరుగారు ఆ ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్నారు. అందువల్ల కుర్చీని అతిథులకు దగ్గరగా లాక్కుని "యౌవనాన్ని ప్రసాదించే అమృతం ఒకటి ఈ ప్రపంచంలో వుందని మీకు తెలియదేమో? ఒక స్పెయిన్ దేశస్థుడు ఆ అమృతం కోసం ఆఫ్రికా కీకారణ్యాల్లోనూ, బర్మా ఘోరారణ్యాల్లోనూ వెదకి, వెదకి వేసారిపోయాడు." అన్నారు.

"ఆఖరుకు అతడా అమృతం ఎక్కడుందో కనిపెట్టాడా?" అన్నాడు సింహాచలం.

"లేదు. అతడు మన్యపు జ్వరంతో చనిపోయాడు. కానీ, ఇప్పుడా అమృతానికి జన్మస్థానమేదో నాకు తెలిసిపోయింది. మొరాకో సరస్సుకు దగ్గరగా వున్న ఫ్లోరిడా ద్వీపకల్పంలోని కొండల్లో ఈ అమృతపు బుగ్గలున్నాయి. వాటిని వికృతరూపులైన ఆటవికులు కావలి కాస్తుంటారు. ఆ మహౌషధాన్ని సంపాదించడానికి బ్రహ్మప్రయత్నం కావాలి. కొన్ని వేలరూపాయలు ఖర్చుపెట్టి నేనీ అమృతాన్ని తెప్పించాను." అన్నారు డాక్టరుగారు.

"ఏదీ, దాన్ని మాకు చూపించలేదే!" అన్నది హనుమాయమ్మ.

"అదేమిటమ్మా, వాడి వత్తయిపోయిన పువ్వును అప్పుడే వికసించిన పువ్వులా మార్చివేసింది ఆ అమృతమే గదా! అంతెందుకూ! మీ రిప్పుడు మంచినీళ్ళనుకొని త్రాగిందికూడా అదే" అన్నారు డాక్టరుగారు.

ఆ సంగతివిని అతిథులు ఆశ్చర్య పడకముందే, అక్కడ మరొక అద్భుత పరిణామం ప్రారంభమైంది. నెరసిపోయిన నీలాద్రి మీసాలు నలుపెక్క సాగినాయ్. హనుమాయమ్మ శిరోజాలు తుమ్మెదరెక్కల్లా నిగనిగ మెరిసి పోసాగినాయ్. ఊడిపోవడానికి సిద్ధమైవున్న సింహాచలం పళ్లు బిర్రబిగుసుకున్నాయ్. గుండూరావుగారి చత్వారం మటుమాయమైపోయింది.

అతిథులు నలుగురూ నవయౌవనులైపోయారు!!

"ఇప్పుడు మనం పసివాళ్ళం! ఇప్పుడు మనం నవయౌవనులం!" అంటూ వాళ్లు పైకిలేచారు. పక్షవాతంచేత స్వాధీనం తప్పివుండిన చేతిని సింహాచలం మాటిమాటికీ ఊపసాగాడు. కొప్పులో సరిగ్గా ఇమడక చెదరిపోతున్న ముంగు

## ★ డాక్టరు భీమశంకరంగారి పరిశోధన ★

ఱల్ని సరిచేసుకుంటూ, హనుమాయమ్మ జడ వేసుకోసాగింది. కాళ్లు పగులు వారడంచేత అడుగెత్తి పెట్టడానికికూడా అశక్తుడుగా వుండిన గుండూరావు మహావీరుడిలా గంభీరమైన పోజుతో పచారు చేయసాగాడు.

సరిగ్గా ఆ శుభసమయంలో డాక్టరుగారు ఒక చిక్కు తెచ్చిపెట్టారు. ఆయన నవయౌవనుల ఉత్సాహోద్వేగాల్ని చూచి సంతసించినతరువాత "మంగళకరమైన ఈ శుభసమయాన నా దొక మనవి వుంది" అన్నారు.

"ఏమిటి?" అన్నాడు గుండూరావు!

"మన నీలాద్రి ఇంతవరకూ బ్రహ్మచారిగా వుండిపోయాడు. పాపం, అతడినిచూస్తే నాకు జాలి వేసేది. అతడు నా మనవిని మన్నించి ఇప్పటినుంచైనా తన బ్రహ్మచర్యాన్ని చాలించుకోవాలని కోరుతున్నాను. వధువు హనుమాయమ్మ" అన్నారుడాక్టరుగారు.

నీలాద్రి ఎగిరి గంతు వేశాడు. కొబ్బరికాయ దొరికినప్పుడు కోతి అలాగే గంతువేస్తుందేమొ!

కానీ సింహాచలం ముఖం ముడుచుకపోయింది. అతడొక వికటహాసాన్ని వెళ్ళగక్కి "హాహా, హనుమాయమ్మలాంటి గొప్పింటిబిడ్డ జులాయిగా తిరిగే నీలాద్రిని పెళ్లాడ్డమా! అందుకు నేనొప్పుకోను." అన్నాడు.

ఇంతలో గుండూరావు తటాలున ముందుకువచ్చి డాక్టరుగారి చేయిపట్టుకుని "డియర్ భీమశంకరం! నా సంగతి నీకు తెలుసు. కాస్త నోరు కలిగినవాణ్ణి నేను. ఏ పార్టీలో చేరినా మరుసటి ఎన్నికల్లో నాకు విజయం తథ్యం. నువ్వు కన్యాదాతవి! నేను వరుణ్ణి!! ఏమంటావ్" అన్నాడు.

"చాల్లేవయ్యా, నీకేం ఒకనీతా, నియమమా? మొదటిభార్యని కొట్టి తరిమేశావు. రెండోభార్య ఆత్మహత్య చేసుకునేదాకా నిద్రపోయావుకావు! మళ్లీ తగుదునమ్మా అని ముచ్చటగా మూడోపెళ్లికి తయారవుతున్నావా? నీకు సిగ్గు లేదూ!" అంటూ సింహాచలం గుండూరావు బ్రతుకు బండారాన్ని కాస్తా బయటపెట్టాడు

"అవునవును సింహాచలం! నువ్వు నిజం చెబుతున్నావ్. కానీ అంతకంటే నిజం ఒకటుంది. గుండూరావెంతటి నీతిలేనివాడైనా నీఅంతటి అబద్ధాల కోరుమాత్రం కాదు" అన్నాడు నీలాద్రి.

"ఏమన్నావు రాస్కెల్! ఇక నోరు తెరిచావంటే డొక్కచించి డోలు కట్టించేస్తాను. జాగ్రత్త!" అంటూ పండ్లుపటపటకొరికాడు సింహాచలం.

"ఏడ్చావులే! నోర్ముయ్" అని ఉరిమాడు నీలాద్రి.

అచిరకాలంలో అక్కడొక చిన్న యుద్ధమే ప్రారంభమైపోయింది. ఎలాగైనా ఆయుద్ధవీరుల నడుమ శాంతి కుదర్చడానికి తన శాయశక్తులాపాటుబడిన డాక్టరు భీమశంకరంగారు, అడపాదడపా నాలుగైదు పిడిగుద్దులు తమకు కూడా ప్రసాదింపబడినందువలన నోరుమూసుకుని ఊరుకున్నారు.

ఇంతలో మరొక విచిత్రం జరిగింది!

నీలాద్రి మీసాలు మళ్ళీ నెరసిపోసాగినై. హనుమాయమ్మ శిరోజాలు తెల్లగా మారిపోయినై. సింహాచలం పళ్లు మళ్లీ కదలసాగినాయ్. గుండూరావు కళ్లు సరిగ్గా కనబడక పోవడంచేత ఎదుటవున్న టేబిల్‌పైన పడిపోబోయాడు.

విచిత్రాతి విచిత్రంగా అక్కడున్న అతిథులు నలుగురూ మళ్లీ వృద్ధులుగా మారిపోయారు!

"అయ్యయ్యో, ఇదేమిటి! మళ్లీ మాకు ముసలితనం వచ్చేసిందే" అన్నారు వాళ్లు.

"మీరు మరికొంతసేపు యువకులుగా వుండివుంటే ఇక్కడొక ఖూనీ జరిగివుండేది! వినా ఈ దివ్య పానీయాన్ని విడవకుండా రెండు మండలాలు సేవిస్తేగానీ యౌవనం పూర్తిగా సిద్ధించదట" అన్నారు డాక్టరుగారు.

"ఆమాట మీ రెందుకప్పుడే చెప్పలేదు?" అని కోపించుకున్నాడు సింహాచలం.

"మీ నిజస్వరూపాన్ని తెలుసుకోవాలనే ఈ చిన్న పరిశోధన జరిపాను. తెలుసుకున్నాను. లోపల ఎక్కడో అణగారి పోయివున్న దుర్గుణాల్ని మళ్ళీ ఒకసారి ప్రకోపింపజేయడమే ఈ పానీయంయొక్క ముఖ్యలక్షణ మని ఋజువైంది. ఒకవేళ ఆ ఫ్లోరిడా ద్వీపకల్పంలోని ఈ దివ్యామృతం పొంగి పొరలి నా ఇంటిముంగిటకు వచ్చినా, నేను దాన్ని త్రాగడానికి సాహసించను" అన్నారు డాక్టరుగారు.

కానీ నీలాద్రి, సింహాచలమూ, గుండూరావు ఆరోజు సాయంత్రమే ఫ్లోరిడా ద్వీపకల్పానికి ప్రయాణమయ్యారు. ★